క్లుప్తంగా

26 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

గోపాల్‌పేట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 26 నుంచి అండర్ 14, అండర్ 17 క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం రమాకాంత్, పీడీ సురేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలుంటాయని తెలిపారు. పాల్గొనే విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్‌తో 26వ తేదీ ఉదయం 9గంటలకు గోపాల్‌పేట పాఠశాల గ్రౌండ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

పట్టణ విద్యార్థినికి 38వ ర్యాంక్

పెబ్బేరు రూరల్: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన సీపీజీఈటీ పరీక్ష ఫలితాల్లో వనపర్తి పట్టణానికి చెందిన విద్యార్థిని నవ్యశ్రీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 38వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్, కళాశాల యాజమాన్యం అభినందించింది.

రైతు రాజ్యమే కాంగ్రెస్ లక్ష్యం



పెబ్బేరు రూరల్: రాష్ట్రంలో రైతు రాజ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని పెద్దమందడి ఎంపీపీ తూడి మేగారెడ్డి అన్నారు. వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డితో కలిసి నాచహళ్లిలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. మహిళలకు గ్యాస్ సిలిండర్ రూ.500లకు అందిస్తామన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తామన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన 500 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మేగారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సత్యారెడ్డి, ఉప సర్పంచు అబ్దుల్లా, నరసింహారెడ్డి, కోమటి వెంకటేశ్వర్లు, కావలి నారాయణ, సాయిలు, రాజు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి మంగళవారం పారిశుద్ధ్య పనులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్, బాలగోవింద్, కృష్ణయ్య, పలువురు పాల్గొన్నారు.

బహుజనులందరూ ఏకమవ్వాలి

పాన్‌గల్: వచ్చే ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలంతా ఏకమై కొల్లాపూర్ నియోజకవర్గంలో మన ఓటు మనమే వేసుకొని మార్పు తీసుకొద్దామని కొల్లాపూర్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్ల పల్లితండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

జానపద కళలను బతికించాలి



పెబ్బేరు రూరల్: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని మరికుంట కలెక్టర్ ఆఫీస్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చీర్ల నాగేంద్రం సాగర్ ఆధ్వర్యంలో జానపద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పల్లెల్లో ఉన్నటువంటి జానపద కళలను బతికించాలని, వివిధ కళారూపాలు డప్పు, కోలాటం బైండ్ల ఒగ్గు డోలు, జిరుతల భజన, యక్షగానం, బుర్రకథ అనేక రకాల జానపద కళలను, పాటలను కాపాడుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా కళాకారుల కన్వీనర్ డాక్టర్ డప్పు స్వామి, నాగరాజు, జయరాం, కృష్ణయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

పెబ్బేరు రూరల్: మండలంలోని మునగమాన్‌దిన్నె శివారులో వరి, వేరుశనగ, పత్తి పంటలను మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. వాతావరణ మార్పుల వల్ల వస్తున్న తెగుళ్లపై రైతులకు సలహాలు, సూచనలు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి నరేష్, రైతులు పాల్గొన్నారు.

పంట సాగు ఆన్‌లైన్ నమోదు చేయాలి..

పాన్‌గల్: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి సాజిద్ రహమాన్ అన్నారు. రేమద్దులలో పంటల వివరాలు పరిశీలించారు.



చెన్నారంలో పొట్టేళ్ల బండ్లతో..



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో..

ఘనంగా బోనాల పండుగ



దంతనూరులో పోచమ్మ బోనాల ఊరేగింపు

పెబ్బేరు రూరల్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంట్లో ఆడపచులు నూతన వస్త్రాలు ధరించి గ్రామ దేవతలైన అమ్మవారికి బోనం కుండను కుంకుమ్మ, పసుపుతో అలంకరించారు. డప్పుల చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. చల్లగా చూడాలని మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీరంగాపురం మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. పోచమ్మ ఆలయానికి బోనాలతో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండల కేంద్రం, అమడబాకుల, కానాయపల్లి, మిరాసిపల్లి గ్రామాల్లో గ్రామ దేవత పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. యాదవులు డోలు వాయిస్తూ, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు బోనాల నైవేద్యం సమర్పించారు. ప్రజలు సుఖసంతోషాలతో చూడాలని అమ్మవారికి మొక్కుకున్నారు.

మదనాపురం: పేదలు తమ ఇంటి ఇలవేల్పుగా కొలిచే పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు యువతులు నూతన వస్త్రాలతో ఆటపాటలతో భాజాభజంత్రీలతో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. దుప్పల్లి, మదనాపురం, దంతనూరు, నర్సింగాపురం, నెలివిడి, శంకరమ్మపేట, కొన్నూరు, తదితర గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది.

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. అప్పారెడ్డిపల్లి, షాపురం తదితర గ్రామాల్లో మహిళలు అందంగా బోనాలు అలంకరించారు. కొందరు కోడి పుంజులు, పొట్టేళ్లను అమ్మవారి ముందు కోసి మొక్కులు తీర్చుకున్నారు.

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని గ్రామాల్లో మంగళవారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు, ఆయా గ్రామాల్లోని పోచమ్మకు బోనాలు ఎత్తారు. చెన్నారంలో పొట్టేళ్ల బండ్లు, డోలు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వీరరాఘవపూర్‌లో..

ఆత్మకూర్: ఆత్మకూర్ మండలంలోని వీరరాఘవపూర్‌లో పోచమ్మ బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆలయం వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ప్రజా ప్రతినిధులు, ఆయా పార్టీల నేతలు ఆలయం వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పోచమ్మ బోనాల పండుగలో పాల్గొన్నారు.



మిరాసిపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు





మదనాపురంలో బోనం ఎత్తిన యువతులు

బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. అంతకుముందు నూతనంగా ఏర్పాటు చేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల దగ్గర సైడ్ డ్రైయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సర్పంచ్ శారద, పీఏసీఎస్ అధ్యక్షుడు వాసుదేవారెడ్డి, భీంరెడ్డి, లక్ష్మీరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, అల్లబాషా, కె.శ్రీనివాస్‌జీ, మాధవ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన నలుగురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం ఎంపీటీసీ సభ్యులు శ్యామల, సింగిల్ విండో డైరెక్టర్ జైపాల్‌రెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన భారతికి రూ.36వేలు, వెంకటయ్యకు రూ.11వేలు, చిన్ననారాయణకు రూ.30 వేలు, రాముడుకు రూ. 24వేల చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసినట్లు తెలిపారు. చెక్కులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, ప్రజాప్రతినిధులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతురెడ్డి, డబ్బా వెంకటయ్య, భీరయ్య, కుర్మయ్య, రామకృష్ణ, మౌలాలి పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో జాప్యంపై రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణంలో జాప్యంపై సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్ మాట్లాడారు. నిర్మాణం పనులు ప్రారంభించి 17 నెలలవుతున్నా పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు సాగునీరు అందించాలి..

మండలంలోని కేఎల్ఐ, భీమా కాల్వల ద్వారా సాగునీరు అందించి రైతుల ఇబ్బందులను తొలగించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని మంగాళపల్లి, తెల్లరాళ్లపల్లి, వీపనగండ్ల మండలంలోని కొర్లకుంట, బొల్లారం గ్రామాలకు రైతులకు సాగునీరు అందడంలేదన్నారు. ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కాల్వల ద్వారా సాగునీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి..

కేతేపల్లిలోని ఉమ్మడి శ్మశాన వాటిక స్థలాన్ని మట్టితో నింపి చదును చేయాలని వారు అధికారులను కోరారు. సర్వే నెం. 627లో బీసీల ఇండ్ల నిర్మాణానికి నీళ్ల లేక ఇబ్బందిగా మారిందన్నారు. మిషన్ భగీరథ పైపులైన్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తెల్లరాళ్లపల్లి ఉప సర్పంచ్ బాలస్వామి, డంగు కుర్మయ్య, కాకం చిన్ననారాయణ, కాశన్న, కుర్వహన్మంతు, చిన్నరాముడు, మాలకుర్మయ్య పాల్గొన్నారు.

ఉద్యమానికి సహకరించండి



అమరచింత: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నామని, తమ పనులను ఇతరులతో చేయిస్తూ ఆందోళనకు విఘాతం కలిగించొద్దని రెండో ఏఎన్ఎంలు తిపుడంపల్లి వైద్యాధికారి డాక్టర్ శరత్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తమను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు ఉమామహేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి



వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న భీమన్న నాయుడు

కొత్తకోట రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భీమన్ననాయుడు అన్నారు. మండలంలోని కానాయపల్లిలో ఆయన సొంత ఖర్చులతో వాలీబాల్ కిట్‌ను అందించారు. క్రీడల వల్ల యువతకు ఆరోగ్యం, మానసికొల్లాసం వస్తుందని, స్నేహభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిద్దయ్య, రవి, బాజ మన్నెం, రమేష, గాంధీ, గోవర్ధన్ నాయుడు, రాజు నాయుడు, మన్నెం పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



నాయకులకు సూచనలు చేస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే హెచ్‌కే సురేష్

గోపాల్‌పేట: రాబోయే ఎన్నికల్లో కార్యక్తలు సమన్వయంతో పనిచేసి బీజేపీ సత్తా చాటాలని కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే హెచ్‌కే సురేష్ అన్నారు. మంగళవారం మండల అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత..

వనపర్తి: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని కర్ణాటక రాష్ట్రం బెలూరు ఎమ్మెల్యే హెచ్‌కె సురేష్ తెలిపారు. మంగళవారం పాన్‌గల్‌రోడ్డు, పీర్లగుట్ట తదితర ప్రాంతాల్లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చురాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీ నారాయణ, బీ కృష్ణ, జింకల కృష్ణయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాలయాలపై నిర్లక్ష్యం వీడి మౌలిక వసతులు కల్పించాలని కర్ణాటక రాష్ట్రం బీజేపీ ఎమ్మెల్సీ హేమలత నాయక్ అన్నారు. ఆత్మకూర్ మండలంలోని బాలకిష్టాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి భాస్కర్, నియోజకవర్గ కన్వీనర్ కర్ని స్వామి, ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

అమరచింత: బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లి వారిని చైతన్య చేయాలని బీజేపీ కర్ణాటక ఎమ్మెల్సీ హేమలత అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జలంధర్‌రెడ్డి, కర్ణేస్వామి, మేర్వరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

నూతన మండలంగా ఏదుల

గోపాల్‌పేట: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఏదుల ప్రజల చిరకాల కోరిక రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో ఎట్టకేలకు నెరవేరింది. గోపాల్‌పేట మండలంలో గ్రామపంచాయతీగా ఉన్న ఏదుల గ్రామాన్ని ఎనిమిది రెవెన్యూ గ్రామాలతో కలిపి కొత్త మండలంగా ప్రకటిస్తూ.. మంగళవారం ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఇందులో రేవల్లి మండలం నుంచి చెన్నారం, చీర్కపల్లి, గోపాల్‌పేట మండలం నుంచి ఏదుల, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి సింగాయపల్లి, తుర్కదిన్నె, మాచుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, రేకులపల్లి రెవెన్యూ గ్రామాలను కలుపుతూ ఏదుల మండలాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు గొల్లపల్లి, అనంతపురం గ్రామాలు సైతం ఏదుల మండలంలో కలిపినట్లు సమాచారం. ఏదుల గ్రామాన్ని మండలం చేస్తూ గెజిట్ విడుదల చేయడంతో గ్రామస్తులు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పటాకులు కాలుస్తూ డప్పు చప్పుళ్లతో సంబరాలు నిర్వహించారు.

ఉద్యోగం సాధించిన మహిళకు సన్మానం

వనపర్తి: సీఐఎస్ఎఫ్ ఉద్యోగం సాధించిన వీ యాదమ్మను మంగళవారం మాజీ మంత్రి డాక్టర్ జీ చిన్నారెడ్డి సన్మానించారు. పేద కుటుంబానికి చెందిన ఆమె మూడేళ్ల పాటు కఠోరదీక్షతో స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ జీడీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిందన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొవాలన్నారు.

అభిలాష్‌తో భేటీ..

కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రంగినేని అభిలాష్ పార్టీ మారుతున్నట్లు వస్తున్న వందంతుల దృష్ట్యా మాజీ మంత్రి చిన్నారెడ్డి చిన్నంబావి మండల కేంద్రంలోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. వస్తున్న వందతుల్లో వాస్తవం లేదని అభిలాష్ వెల్లడించినట్లు తెలిపారు.

ఓటరు నమోదు క్యాంపులు నిర్వహించాలి

వీపనగండ్ల: అర్హులైన వారిని నూతన ఓటర్లుగా గుర్తించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాల బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శని, ఆదివారాలు ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, ఆర్ఐ కురుమూర్తి, బీఎల్‌ఓలు ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



చందాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు

పెబ్బేరు రూరల్: నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా, గ్రామంలో పరిశుభ్రత పాటించాలని అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్, డీపీఓ సురేష్‌తో కలిసి వనపర్తి మండలంలోని చందాపూర్, పెద్దతండా గ్రామ పంచాయతీల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు, ప్రదర్శన సూచిక, గ్రామ పంచాయతీల రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో తిరుగుతూ పారిశుద్ధ్యం, హరితహారంలో నాటిన మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్, సెగ్రిగేషన్ షెడ్, వాటర్‌ట్యాంక్‌లు, పరిశుభ్రతను పరిశీలించారు. జిల్లాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పరిరక్షణ అధికారి రాంబాబు

వనపర్తి: బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు సూచించారు. మంగళవారం స్థానిక సీవీ రామన్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. బాల్యవివాహ నిషేధ చట్టం 2006, ఫోక్సో చట్టం 2012, చైల్డ్ లేబర్ చట్టాలు చాలా పటిష్టంగా ఉన్నాయన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలుసుకోవాలన్నారు. చట్టాలు మీరిన వారికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా తప్పదన్నారు. ఫోక్సో చట్టం 2012 ప్రకారం బాలలపై ఎలాంటి లైంగిక వేధింపులకు పాల్పడినా శిక్ష తప్పదన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 టోల్ ఫ్రీకి కాల్ చేస్తే.. వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఎం.నరేందర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: బాలలు, మహిళలు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ నరేష్ అన్నారు. పెద్దమందడి మండలంలోని మనిగిల్ల జెడ్పీహెచ్ఎస్‌లోని విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ రాజేష్‌కుమార్, ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.

విద్యపై దాతృత్వం కలిగి ఉండాలి

దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



నివాళి అర్పిస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: విద్య అనేది ప్రతిఒక్కరికీ అవసరమని, విద్యపై దాతృత్వం కలిగి ఉండాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి 155వ జయంతి సందర్భంగా మండల పరిధిలోని రాయిణిపేట స్టేజీ సమీపంలోని రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 'కోటికి ఒక్కరే పుడుతారు పుణ్యపురుషులు' వారిలో అవుతారు మహానుభావులు అనే పదానికి అర్థాన్ని ఇచ్చిన గొప్ప వ్యక్తి రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి అని కొనియాడారు. ఆ రోజుల్లో తెలంగాణ ప్రాంతం నుంచి విద్యా కుసుమాలను తయారు చేయాలనే ఉద్దేశంతో చరిత్రలో నిలిచిపోయేలా రెడ్డి హాస్టల్‌ను ప్రారంభించారన్నారు. రెడ్డి హాస్టల్ రెడ్డి కులస్తులకే కాకుండా, ఇతర కులాల వారికి కూడా చాలా ఉపయోగపడుతుందన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు, సీడీసీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, శ్రీనివాస్‌జీ, పాండురంగయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా వెంకట్రామిరెడ్డి జయంతి



రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

కొత్తకోట: రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి 155వ జయంతిని పట్టణంలో వివిధ పార్టీల నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం రెడ్డి హాస్టల్స్‌ను ఏర్పాటు చేసి సామాన్యుడికి సైతం మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, సాక బాలనారాయణ, గాయత్రి శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, రాధాకృష్ణారెడ్డి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాగవరంలో..

పెబ్బేరు రూరల్: రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి జయంతిని వనపర్తి రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో వనపర్తి పట్టణం నాగవరంలోని రెడ్డి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, అయ్యప్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదుతో రైతులకు ప్రయోజనం



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ దామోదర్

అమరచింత: రైతులు తాము పండించిన పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు విన్నవించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ దామోదర్ అన్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లె గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న రైతులకు పంటల నమోదు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పండిన పంటను అమ్ముకొనే సమయంలో వ్యవసాయ అధికారులు ధ్రువీకరించే అవకాశం ఉందని, దీంతో రైతులు ఎక్కడైనా తమ పంటను అమ్ముకొనే వీలుందన్నారు. సాగుచేసిన పంటలకు అకాల విపత్తుల కారణంగా నష్టం వాటిల్లితే ప్రభుత్వపరంగా గుర్తించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లేష్, సర్వారెడ్డి రైతులు పాల్గొన్నారు.

మత్స్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ కార్యవర్గం

పెబ్బేరు రూరల్: పట్టణంలోని మత్స్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ కార్యవర్గం మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడుగా పవన్, ఉపాధ్యక్షుడుగా సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోశాధికారి ఉషాన్, మిగతా వారిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు.